## క్లుప్తంగా

### గులాబ్‌జామ్‌ల అలంకరణలో గోవిందుడు


గులాబ్ జామ్ పండ్ల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి గులాబ్ జామ్‌ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలి రావటంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే భక్తులు రావటంతో దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి సుమారు ఆరు వేల మందికి అన్న సమారాధన చేసినట్టు ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదం, నిత్య గోత్రార్చన, అన్న సమారాధనకు భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని దీనికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు.

### ఘనంగా రేగులమ్మ ఉత్సవాలు


పెద్దాపురంలో రేగులమ్మను ఊరేగిస్తున్న భక్తులు

గోపాలపురం: మండలం పెద్దాపురంలో ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమైన రేగులమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారిని గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య వీధివీధి తిరుగుతూ అమ్మవారికి పొన్పులు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీతో అమ్మవారి జాతర ఉత్సవాలు ముగుస్తాయని పుట్టింటి వారైన పిన్నమనేని, అత్తింటివారైన వేములపల్లి కుటుంబ సభ్యులు తెలిపారు. జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు కొర్లపాటి అన్నవరం, పిన్నమనేని దత్తాత్రేయుడు, తానింకి సత్యనారాయణలు తెలిపారు.

### యోగాంధ్రలో భాగస్వాములు కావాలి


మెయిన్ రోడ్డు సెంటర్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి (కొవ్వూరు): అందరి ఆరోగ్యం లక్ష్యంగా యోగాంధ్ర చేపట్టినట్టు ఆర్డీఓ రాణి సుస్మిత పేర్కొన్నారు. కొవ్వూరులో శనివారం యోగాంధ్ర ప్రచారాన్ని కోలాహలంగా నిర్వహించారు. పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించి యోగా వల్ల కలిగే లాభాలు, విశిష్టతను వివరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

### 91శాతం పింఛన్ల పంపిణీ

పెరవలి: మండలంలో పింఛన్ల పంపిణీ 91 శాతం పూర్తయ్యిందని ఎంపీడీఓ పద్మజ తెలిపారు. మండలంలో అన్ని రకాల పింఛన్లు కలిపి 10,110 ఉన్నాయని వీటిలో 9201 మందికి నగదు అందించామన్నారు.

**మంత్రి దుర్గేష్ ఆధ్వర్యంలో..**

నిడదవోలు: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు భరోసా ఇస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని 4, 8 వార్డులో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లను మంత్రి దుర్గేష్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

నల్లజర్ల: స్థానిక కోనేరు ఒడ్డున ఉన్న ఆంజనేయ ఆలయంలో శనివారం నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. డి.సీతారాం బాబు దంపతులు పూజాదికాలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, పంచగవ్యం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. 1200మందికి అన్నసమారాధన జరిగింది. జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఆలపాటి రామకృష్ణ, చింతా చైతన్య, వెల్లంకి రాఘవ, సవలం రామకృష్ణ, పేరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన వేసవి శిక్షణ

తాళ్లపూడి(కొవ్వూరు): క్రీడలపై ఆసక్తిని పెంచే లక్ష్యంతో వేసవి సెలవులు సద్వినియోగం అయ్యేలా నిర్వాహకులు కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి శిబిరాన్ని శనివారం ముగించారు. అలాగే సత్యవతి నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నెల రోజుల పాటు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. వీటికి అవంతి గ్రూప్ చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్ ఏర్పాట్లు, బహుమతులు సమకూర్చారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, అవంతీ గ్రూప్ చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్ విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్యే రామారావు పాల్గొన్నారు.

# కొబ్బరి... ధరల సిరి


తీపర్రు కొబ్బరి తోటలో కాయలను లెక్కిస్తున్న కూలీలు


ఖండవల్లిలో కొబ్బరి కాయల నాణ్యతను పరిశీలిస్తున్న కూలీలు

- ధర పెరగడంతో రైతుల హర్షం
- వెయ్యి కాయలు రూ.8 వేల నుంచి రూ.9 వేలు
- చేలకే వచ్చి దింపు నుంచి రవాణా వరకు చార్జీలు భరిస్తున్న వ్యాపారులు

పెరవలి: కొబ్బరికి మంచి గిట్టుబాటు ధర లభించటంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్టులో కొబ్బరి కాయల ధర నాణ్యతను బట్టి వెయ్యి కాయలు రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు పలుకుతున్నా రైతులకు మాత్రం ఎటువంటి ఖర్చు లేకుండా నేరుగా చేనువద్దకే వచ్చి కాయ ఒక్కటింకి రూ.8 నుంచి రూ.9 చెల్లిస్తున్నారు. వ్యాపారే దింపు, మోత, రవాణా, ఒలుపు వంటివి అన్ని తానే భరిస్తున్నాడు. అదే రైతు దింపు తీసి ఒక్క చోట గుట్టగా పెట్టితే రూ.12 వేలు చెల్లిస్తున్నాడు. గతంలో వెయ్యి కాయలకు నాణ్యతను బట్టి రూ.5500 నుంచి రూ.6500 చెల్లించేవారు కానీ నేడు మార్కెట్ పెరగటంతో అది రూ.8 నుంచి రూ.9 వేలకు చేరింది.

**నియోజకవర్గంలో సాగు ఇలా**

నిడదవోలు నియోజకవర్గంలో 1500 ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఇదే కాకుండా చేలగట్లు, పుంత గట్లు, చెరువు గట్లు, లంకభూముల్లో కొబ్బరి సాగవుతోంది. ఇందులో నిడదవోలు మండలంలో 600 ఎకరాలు, ఉండ్రాజవరం మండలంలో 500 ఎకరాల్లో పెరవలి మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, నడుపల్లి, తీపర్రు, కాకరపర్రు ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో 400 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

**దిగుబడులు చూస్తే..**

కొబ్బరి తోటల్లో గతంలో ఎకరానికి 600 నుంచి 800 కాయలు వస్తే నేడు తోటలు ఆరోగ్యవంతంగా ఉండటం వల్ల 1200 నుంచి 1500 దిగుబడి వస్తోంది. గతంలో ధర ఉంటే దిగుబడి ఉండేది కాదని, నేడు ధర ఉండి గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు అంటున్నారు. ఇటువంటి పరిస్థితి గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేదని, ధర ఉంటే దిగుబడి లేక దిగుబడి ఉంటే ధర లేక తీవ్రంగా నష్టపోయామని ఇప్పుడు మాత్రం రెండు లభిస్తున్నాయని తెలిపారు.

**ధరల పెరుగుదలకు కారణం**

కొబ్బరికి మార్కెట్ ధరలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఈ ఏడాది కుంభమేళా నుంచి ప్రారంభమైన కొబ్బరి ధరల పెరుగుదల నేటి వరకు కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు అనూహ్యంగా తగ్గిపోవటంతో ఇక్కడి కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఇక్కడ నుండే ఎగుమతుల అవుతున్నాయి. అందుకే మన కొబ్బరికి డిమాండ్ వచ్చిందని వ్యాపారులు చెప్పున్నారు.

**చేల వద్దకే వ్యాపారులు**

గతంలో కొబ్బరి దించండని వ్యాపారుల చుట్టూ తిరిగే రైతులకు వద్దకు నేడు వ్యాపారులే వస్తున్నారు. మార్కెట్‌లో కొబ్బరి కాయలు దొరక్కపోవటంతో పాటు ఇతర రాష్ట్రాల కాయలు లేకపోవడం వల్ల మన కాయలకు డిమాండ్ ఏర్పడింది. దీనితో వ్యాపారులు నెల రోజులకు దింపు తీస్తున్నారు. రైతులకు ముందుగానే సొమ్ములు ఇచ్చి మరీ దింపుతున్నారంటే డిమాండ్ ఎలా ఉందో అర్థమవుతుంది.

**ఈ ధర ఎంత కాలం ఉంటుందో..**



కొబ్బరికి డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాల సరుకు లేకపోవటంతో ఈ ధరలు ఉన్నాయి. ఈ ధరలు ఎంత కాలం ఉంటాయో తెలియదు. అందుకే నిల్వలు వేయటం లేదు. వచ్చిన కాయ వచ్చినట్లు మార్కెట్‌కు తరలిస్తున్నాం.

– అడబాల బ్రహ్మయ్య, కొబ్బరి వ్యాపారి, అన్నవరప్పాడు

**దిగుబడి బాగుంది**

గతంలో వ్యాపారుల చుట్టూ తాము తిరిగేవాళ్లం, కానీ నేడు వ్యాపారులే తమ చుట్టూ తిరుగుతున్నారు. గత 8 ఏళ్లలో ఈ ధర చూడలేదు. దిగుబడి బాగుంది. గిట్టుబాటు ధర లభిస్తోంది.

– నందమూరి నారాయణరావు, రైతు, తీపర్రు

### విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి చర్యలు

సాక్షి ఇంపాక్ట్

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెంలో నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ (వెల్‌నెస్ సెంటర్)ను త్వరలో పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బ్రాహ్మణగూడెంలో అసంపూర్తిగా నిలిచిన విలేజ్ హెల్త్ క్లినిక్‌పై మే 30వ తేదీన 'సాక్షి'లో పల్లె విలాపం శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామాల్లో వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తామని వైద్యసిబ్బంది పేర్కొన్నారు.

### విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లి సెక్షన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీ డీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### కమ్యూనిటీ హాలు ప్రారంభం


కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త రాజీవ్‌కృష్ణ

చాగల్లు: గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ నాయకులు, పారిశ్రామికవేత్త ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. మండలంలోని బ్రాహ్మణగూడెంలో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) జ్ఞాపకార్థం రాజీవ్‌కృష్ణ ఆర్థిక సాయం రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ తెలగా కాపు సేవా సంఘం కమ్యూనిటీ హాలును శనివారం రాజీవ్‌కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ శ్రీనివాస్, సర్పంచ్ గురువెల్లి కుమారి, గోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబూరావు, నాయకులు దొమ్మేటి వేణు, ప్రత్తిపాటి సుబ్బారావు, పి.సుధీర్, ఎ.రామకృష్ణ, విష్ణుమోహన్‌రావు పాల్గొన్నారు.

# మెరుగైన జీవన శైలికి యోగాంధ్ర


యోగా శిక్షణలో పాల్గొన్న యోగాంధ్ర ప్రత్యేకాధికారి నిర్మలకుమారి

నల్లజర్ల: నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మంచి జీవన శైలి అలవడుతుందని యోగాంధ్ర మండల ప్రత్యేకాధికారి నిర్మలకుమారి అన్నారు. శనివారం దూబచర్ల సంఘమిత్ర పాఠశాలలో యోగాగురువు దూబగుంట్ల రాజారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణను ఎంపిడీఓ సింహాద్రిరావుతో పాటు, ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో కొద్దిసేపు యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుందన్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగియడంతో ఆయా అంశాలలో పోటీలు నిర్వహించి పార్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడిగడప బాలయ్య, కార్యదర్శి సీహెచ్ అలేఖ్య, సంఘమిత్ర స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు, చీమకుర్తి కృష్ణ ప్రసాద్, సోమిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

**ఎంతో ప్రయోజనం**

నిడదవోలు రూరల్: నిత్యం క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయని మండల ప్రత్యేకాధికారి కె.దుర్గేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో శనివారం యోగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, కార్యాలయ ఏఓ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో కార్యకర్తలకు దిశానిర్దేశం


గ్రామ కమిటీలను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకట్రావు

చాగల్లు: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలో ఊనగట్ల, నందిగంపాడు, ఎస్.ముప్పవరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఏడాది కూటమి పాలనలో ప్రజలు విసిగిపోయారని, ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా ఎన్నికల హామీలను గాలికి వదిలివేసిందని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, 2019 ఎన్నికలకు ఎలా పనిచేశారో అలాగే పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఊనగట్ల గ్రామాధ్యక్షుడిగా వీరమల్లు కిశోర్, ఎస్.ముప్పవరం అధ్యక్షుడిగా నూతంగి మురళి, నందిగంపాడుకు ఆతుకూరి సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా ఏడుకొండలు, ఎంపీపీ మట్టా వీరస్వామి, మండలాధ్యక్షుడు మట్టా వెంకట్రావు, సర్పంచ్‌లు కుదప రాంబాబు, మద్దుకూరి రవి, ముప్పిడి మహాలక్ష్మడు, తాల్లూరి దామోదరం, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, కాశీవర్జుల రామసుబ్బారాయుడు, వీరమళ్ల శివ, కంకటాల శ్రీను, మేకా సురేష్, బొర్రా రజిని, ఇంటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ధూమపానం ఆరోగ్యానికి హానికరం


పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


పొగాకు అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

తాళ్లపూడి: స్థానిక పీహెచ్‌సీ వద్ద శనివారం వరల్డ్ నో టొబాకో డే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బీవీవీ భవాని ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టి మాట్లాడుతూ ధూమపానం ఆరోగ్యానికి హానికరమన్నారు. దాని వల్ల క్యాన్సర్ వస్తుందని తెలిపారు. మైనర్లకు సిగరెట్లు విక్రయించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరంలో..**

ఉండ్రాజవరం: పొగాకు రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.ఉషాదేవి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని స్థానిక పీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషాదేవి మాట్లాడుతూ పొగాకు అలవాటు మనిషిలోని అంతర్గత అవయవ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మనిషి ప్రశాంత వాతావరణానికి అలవాటు పడటం ద్వారా నికోటిన్ వాడకాన్ని దూరం చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, సీహెచ్ఎన్ కుమారి, సీనియర్ అసిస్టెంట్ నారాయణ రెడ్డి, స్టాఫ్ నర్స్ సంధ్య, ఫార్మాసిస్ట్ శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

- వికసిత కృషి సంకల్ప అభియాన్
- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పెదబాబు
- మూడు గ్రామాలలో సదస్సుల నిర్వహణ


రైతులతో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పెదబాబు

నల్లజర్ల: డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గంటావారిగూడెం, మార్లెళ్లమూడి, చోడవరం గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడి సాధించేందుకు కేంద్రప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. గంటావారిగూడెంలో డాక్టర్ రేఖ మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తెల్లదోమ నివారణ, గేనోడెర్మా ఎక్కువగా ఉందని రైతులు చెప్పడంతో దానిపై సూచనలిచ్చారు. ఉద్యానశాఖాధికారి బబిత మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. వివిధ పంటలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్గించారు. మార్లెళ్లమూడిలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దీప్తి, డాక్టరు మేరీరాణి మాట్లాడుతూ వరి, కూరగాయల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు వాటి యాజమాన్య పద్ధతులు, ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకోలో యాజమాన్య పద్ధతులను వివరించారు. చోడవరంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టరు పెదబాబు, ఐసీపీఆర్ సైంటిస్ట్ డాక్టర్ కె.రామచంద్రుడు మాట్లాడుతూ కొమ్ముపురుగు, మొవ్వకుళ్లు తెగులు నివారణపై రైతులకు వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థాయి ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### ఆర్వోబీ పనులు సత్వరం పూర్తి చేయాలి


ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: నిడదవోలు ప్రజలందరూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులో నిర్మాణం ఉన్న ఆర్వోబీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణంతో అధ్వానంగా తయారైన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు వర్షపు నీరు నిల్వలేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### చంద్రబాబు వెన్నుపోటు దినంపై నేడు పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపురం: ఈ నెల నాలుగో తేదీన నిర్వహించనున్న చంద్రబాబు వెన్నుపోటు దినానికి సంబంధించి ఆదివారం పోస్టర్ ఆవిష్కరించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మాజీ హోం మంత్రి, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తానేటి వనిత పాల్గొంటారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు హాజరు కావాలని శ్రీరామమూర్తి పిలుపునిచ్చారు.

# వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడిబోయిన



దేవరపల్లి: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకు చెందిన మేడిబోయిన గంగరాజు నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేసినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో మండల పరిషత్ అధ్యక్షుడిగా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్, ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. తనపై నమ్మకంతో పదవిని ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, నియోజకవర్గంలోని నాయకులకు గంగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారాలు

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు పటికబెల్లం, బెల్లంతో తులాభారాలు వేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ప్రతి శుక్ర, శని, ఆదివారాలు భక్తులు ఎక్కువగా మంది వస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నిడదవోలు మండలం అట్లపాడుకు చెందిన రేఖ వెంకట సుబ్బారావు, రాజీ దంపతుల కుమారుడు దుర్గా సాంబశివరాజుకు, గుంటూరు జిల్లా పెదవడ్లపూడికి చెందిన నందికోళ్ల రాము, సాయి జ్యోతి దంపతుల కుమార్తె మహిషణ్ముఖ లక్ష్మి దుర్గ, కుమారుడు సిద్దు వెంకట అయ్యప్పకు పటిక బెల్లంతో కుటుంబ సభ్యులు వేర్వేరుగా తులాభారం వేశారు. తెలంగాణాలోని తాండూరి గ్రామానికి చెందిన మాత శ్రీనివాసరావు, సీతారత్నం దంపతుల కుమార్తె జ్యోతి స్వరూపకు బెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు.

# వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తొమ్మండ్రు


తొమండ్రు రమేష్


ముచ్చికర్ల రవి

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన తొమ్మండ్రు రమేష్ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రమేష్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో రమేష్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగాను, ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. తనపై ఎంతో నమ్మకంతో పదవిని ఇచ్చిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర మాజీ హోం మంత్రి, నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత, పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీగా రవి**

గోపాలపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీగా మండలం చిట్యాల గ్రామానికి చెందిన ముచ్చికర్ల రవిని నియమించినట్లు శనివారం ఆయన తెలిపారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు రవి పేర్కొన్నారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత, రాష్ట్ర యూత్ అధ్యక్షులు జక్కంపూడి రాజాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### శస్త్రచికిత్సకు రూ.లక్ష సాయం


సత్యనారాయణకు ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేవక్ సభ్యులు

ఉండ్రాజవరం: గోటేరు గ్రామానికి చెందిన తోట సత్యనారాయణ గుండె శస్త్రచికిత్సకు జనసేవక్ ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న సత్యనారాయణకు రెండు నెలల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రిలో చూపించుకోగా గుండె దగ్గర నరం ఉబ్బిందని వెంటనే శస్త్రచికిత్స చేయాలని, లేకపోతే ప్రాణానికి ప్రమాదం అని తెలిపారన్నారు. దాంతో సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులతో కలసి చెన్నైలోని వెల్లూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రూ.పది లక్షలు ఖర్చవుతుందని తెలిపారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు వర్రే రమేష్ (బాబి), నార్ని దుర్గారావు, మీసాల సురేష్, ముత్తయ్య ఈ మొత్తాన్ని సేకరించి అతనికి అందజేశారు.

### ముగిసిన డ్యాన్స్, మ్యూజిక్ శిక్షణ

తాళ్లపూడి: బాల్యం నుంచే విద్యతో పాటు దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడానికి సహ పాఠ్య కార్యక్రమాలైన డ్యాన్స్, సంగీతం, చెస్, కీబోర్డ్ ఎంతగానో ఉపయోగపడతాయని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ వీవీ అనీష్ తెలిపారు. స్థానిక మాంటిస్సోరి స్కూల్లో డ్యాన్స్ అండ్ మ్యూజిక్, కీబోర్డ్, చెస్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు.